సాక్షి
వికారాబాద్

శనివారం । 24 । ఆగస్టు । 2024



ధారూరు అభివృద్ధికి..

ధారూరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.57 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్ తెలిపారు. 10లో▸



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

మహిళాలోకం.. మల్లెల అభిషేకం

తాండూరు పట్టణంలోని శ్రీ నగరేశ్వర ఆలయంలో కొలువుదీరిన వాసవీ కన్యకాపరమేశ్వరీ మాతకు శుక్రవారం భక్తులు కుంకుమార్చన నిర్వహించారు. శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మల్లెపూల అభిషేకం, గోమాతకు పూజ చేశారు. కీర్తనలు, భజన పాటలతో ఆలయం మార్మోగింది. వేడుకలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు, సభ్యులు నాగలక్ష్మి, ప్రగతి, సరిత, శోభ, దీప, శశిరేఖ, అర్చన, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

– తాండూరు టౌన్



గోమాతకు పూజ చేస్తున్న మహిళా భక్తులు

న్యూస్‌రీల్

నేడు లక్ష తులసీ అర్చన



కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామికి శ్రావణమాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని లక్ష తులసీ దళాల అర్చన చేయనున్నారు. పూలు, తులసీ దళాలతో అమ్మవారు, స్వామివారికి విశేష అలంకరణ చేస్తారు. బ్రాహ్మణులు విష్ణు సహస్ర నామావళి పటిస్తూ లక్ష తులసీ దళాలతో అర్చన చేస్తారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తోమాల సేవ, అలంకరణ చేస్తారు. విష్ణు సహస్ర నామార్చన, నైవేద్యం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తెలిపారు.

కబ్జా చెర నుంచి విడిపించాలి

కలెక్టర్‌ను కోరిన అన్నసాగర్ రైతులు



కలెక్టరేట్ వద్ద అన్నసాగర్ గ్రామస్తులు

యాలాల: అన్నసాగర్ గ్రామ ఊరచెరువు పానాది బాటను కబ్జా చెర నుంచి విడిపించాలని గ్రామస్తులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరారు. శుక్రవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని ఊర చెరువు మీదుగా ఉన్న పానాది బాటను రైతులు పొలాలకు వెళ్లేందుకు వినియోగించేవారని తెలిపారు. కానీ కొందరు ఆ బాటను కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో యాలాల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే పానాది బాటను కబ్జా చెర నుంచి విడిపించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్‌లు, రైతులు సాయిలు, రవికుమార్, మల్లారెడ్డి, శేఖర్, ఎల్లప్ప, సుకుమార్, శ్రీనాథ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



పాఠశాల వసతులపై ఆరా తీస్తున్న కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి

దుద్యాల్: పాఠశాలల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హకీంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు కావల్సిన వసతుల గురించి పాఠశాల హెచ్‌ఎం నరేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు సరిపోవడం లేదని, అదనపు గదులు నిర్మించాలని హెచ్‌ఎం కోరారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీకేతండాకు జీపీ హోదా ఇవ్వాలి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ధారూరు: స్టేషన్ ధారూరు గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న డీకే తండాకు జీపీ హోదా కల్పించాలని ఆ తండా ప్రజలు శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. డీకే తండా స్టేషన్ ధారూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉండటం వల్ల అంతగా అభివృద్ధి జరుగడం లేదన్నారు. తండాలో 520 మంది జనాభా, 315 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ప్రత్యేక గ్రామ పంచాయతీకి అర్హత ఉందని, గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక జీపీ చేయాలని ప్రతిపాదించామని వారు చెప్పారు.

పల్లెపోరు.. ఏర్పాట్ల జోరు

- పంచాయతీ ఎన్నికల నిర్వహణ పనుల్లో అధికారులు బిజీ
- వార్డుల వారీగా కొనసాగుతున్న ఓటర్ల విభజన
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ
- జిల్లాలో 565 జీపీలు, 4,850 వార్డులు



చెంగోల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

తాండూరు: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో జరిగే ఎన్నికల కోసం వచ్చేనెల 6న ఓటరు ముసాయిదాను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు మూడు రోజులుగా జీపీల్లో వార్డుల వారీగా ఓటర్ల విభజన చేపట్టారు. బీసీ ఓటర్ల గణనతో పాటు రిజర్వేషన్ల ప్రకారం జాబితా తయారు చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఇందుకు సంబంధించి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించారు.

పెరగనున్న ఓటర్లు

జిల్లాలోని 565 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. అన్ని జీపీల్లో కలిపి మొత్తం 4,850 వార్డులున్నాయి. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహణకు ఓటర్ల విభజన ప్రక్రియ కొనసాగుతోంది. నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉండగా గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మొత్తం 9.83 లక్షల మంది ఓటర్లు నమోదై ఉన్నారు. అయితే పంచాయతీ ఎన్నికల కోసం మున్సిపాలిటీల్లోని ఓట్లను తీసేసి లిస్ట్ రూపొందిచనున్నారు. 2019 జాబితా ప్రకారం జిల్లాలో 5,68,903 మంది పంచాయతీ ఓటర్లు ఉన్నారు. గతంలో బీసీ ఉప కులాలు కలిపి 3,09,153 మందిగా నమోదయ్యారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.

రిజర్వేషన్లపై అయోమయం

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లపై అయోమయం నెలకొంది. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. గతంలోని నిబంధనల ప్రకారమే రిజర్వేషన్లను రూపొందిస్తున్నారు. జీపీలకు పదేళ్ల రిజర్వేషన్ వర్తించేలా గత ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దీన్ని కొనసాగిస్తుందా..? సవరణకు మొగ్గు చూపుతుందా..? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. పాత రిజర్వేషన్లే అమలులో ఉంటాయనే ఉద్దేశంతో ఆశావహులు ఇప్పటికే గ్రామాల్లో బలం పెంచుకునేందుకు పావులు కదుపుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్

అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్: అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తెలంగాణ హక్కుల ముసాయిదా బిల్లు – 2024, ఎల్‌ఆర్‌ఎస్‌పై ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. పనుల పురోగతిని శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో, చురుగ్గా పని చేసినప్పుడే సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేయగలమని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌తో పాటు తెలంగాణ ముసాయిదా బిల్లుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. అనంత గిరులను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.400 కోట్లు కేటాయించిందని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఐదేళ్లలో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. అధిక వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న పంటల వివరాలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ధరణి స్థానంలో భూమాత చట్టాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు. రైతులు కోర్టుల చుట్టు తిరగకుండా క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అయ్యేలా ఈ చట్టం రూపకల్పన జరుగుతుందన్నారు. చెరువుల్లో ఎంత మేర నీరు ఉందో అంచనా వేసి ఆయకట్టుకు వదలాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ చైర్‌పర్సన్లు మంజుల, స్వప్న ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కల్తీకల్లు ఘటనపై చర్యలు తీసుకోవాలి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: కల్తీకల్లు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ మండలం పీరంపల్లిలో కల్తీ కల్లు బారిన పడి పట్టణంలోని మిషన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం ఆయన పరామర్శించారు. వైద్యుడు అవినాష్‌తో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్తీకల్లును పూర్తిగా నిషేధించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా కొనసాగుతున్న కల్లు దుకాణాలను వెంటనే తొలగించాలన్నారు. గ్రామంలో చాలా మంది కల్తీకల్లు బారిన పడ్డారని, ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. అది ఈత, తాటి కల్లు కాదని డైజోఫామ్‌తో తయారు చేసిన కృత్రిమ కల్లు అని పేర్కొన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా కల్తీకల్లు, మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, అధికారులు వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడటం జరుగుతుందని తెలిపారు. శాంపిల్స్ పంపితే అసలు విషయం తెలుస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు వడ్ల నందు, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, బస్వలింగం, రాజు నాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

45కు చేరిన బాధితుల సంఖ్య

కల్తీకల్లు తాగి ఆస్పత్రి పాలైన వారి సంఖ్య 45 చేరింది. శుక్రవారం సైతం పలువురు ఆస్పత్రుల్లో చేరగా మంగళవారం పలువురు డిశ్చార్జి అయ్యారు. గ్రామంలో మెడికల్ క్యాంపు కొనసాగుతోంది. ముగ్గురిని హైదరాబాద్‌కు తరలించగా, ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.

రైతు ధర్నాలో రాజకీయ నిరుద్యోగులే

బడంగ్‌పేట్: తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గురువారం నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్‌ఎస్ రాజకీయ నిరుద్యోగులే తప్పా రైతులు పాల్గొనలేదని యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులకు పదేళ్లుగా రైతులు గుర్తుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే కేటీఆర్‌కు రైతులు గుర్తొచారా అని ప్రశ్నించారు. రైతు రుణాలను రూ.2లక్షల వరకు తప్పకుండా ఏకకాలంలో మాఫీ చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని హామీలను పరిష్కరిస్తారన్నారు.

రుణమాఫీపై ఓర్వలేకే విమర్శలు

- అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్ రూరల్: రైతులకు రుణమాఫీని విజయవంతంగా అమలు చేయడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. అందుకే ధర్నాలు, నిరసనలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు దఫాలుగా పాలన సాగించిన వారికి రుణమాఫీ గుర్తుకు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రుణమాఫీ చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ధర్నాలు, నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీ నాయకుల మాటలు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకోని ఎక్కడ ఉనికి కోల్పోతామోనన్న భయంతో నిరసనలు, ధర్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. త్వరలో అందరికీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో ఉండి మంత్రిగా పని చేశారని, ఇప్పుడు అదే పార్టీ గురించి మాట్లాడడం సరైంది కాదని హితవు పలికారు.

20ఏళ్ల నిర్లక్ష్యం

శిథిలావస్థలో గురుకులం

- రూ.3.80 కోట్లతో పనులు
- నాసిరకంగా పిల్లర్లు, స్లాబ్
- రూ.80 లక్షల ప్రజాధనం వృథా
- అవస్థల్లో సిబ్బంది, విద్యార్థులు



కూలడానికి సిద్ధంగా ఉన్న భవన నిర్మాణం

కొడంగల్: రెండు దశాబ్దాల క్రితం ఇంజనీరింగ్ విభాగం అధికారులు చేసిన అవినీతి నేడు బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు, అధ్యాపకులకు శాపంగా మారింది. రూ.80 లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నాసిరకంగా భవన నిర్మాణం చేపట్టారు. కనీస ప్రమాణాలు పాటించకుండా భవనాన్ని నిర్మిస్తున్నారనే ఆరోపణలు రావడంతో పనులను అర్ధంతరంగా ఆపేశారు. దీంతో నాటి నుంచి నేటి వరకు పట్టణ శివారులోని మహాత్మా జ్యోతీరావ్‌పూలే బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో చేపట్టిన భవన నిర్మాణం అవినీతికి సాక్ష్యంగా నిలుస్తోంది.గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న అధ్యాపకు లకు ఇప్పటి వరకు నివాసగృహాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తగిన చ ర్యలు తీసుకొని నూతన భవనం తోపాటు అధ్యాపకులకు క్వార్టర్లు, వంటశాల, డైనింగ్ హాల్‌కు నిధు లు మంజూరు చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు.

'ఎలుగుబంటి' అవినీతి ఇలా..

ఉమ్మడి ఏపీలో రాష్ట్ర వ్యాప్తంగా నివాసగృహాలు లేని గురుకుల పాఠశాలల అధ్యాపకులకు క్వార్టర్లు నిర్మించడానికి 2003లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 2005–06 సంవత్సరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ నిధి నుంచి ఒక్కో భవన నిర్మాణానికి రూ.3.80కోట్లు మంజూరు చేశారు. ఇందులో భాగంగా కొడంగల్‌లోని బీసీ బాలుర గురుకుల పాఠశాలకు నిధులు విడుదలయ్యాయి. అధ్యాపకులకు నివాసగృహాలతో పాటు ప్రిన్సిపాల్‌కు రెండు అంతస్తులతో అధునాతన వసతులతో గృహం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అందుకుగాను మొదటి విడతలో రూ.80 లక్షలు విడుదల చేశారు. 2005లో మత్స్య శాఖలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎలుగుబంటి సూర్యనారాయణ రాజు భవనాల నిర్మాణ బాధ్యతను తీసుకున్నారు. ఆయన అవినీతికి పాల్పడి భవన నిర్మాణాన్ని నాసిరకంగా చేపట్టారు. కనీస ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వచ్చాయి. మంజూరైన నిధుల్లో పెద్ద మొత్తాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడడంతో 2008లో ఆయన అవినీతి వెలుగులోకి వచ్చింది. నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో వాస్తవాలు బహిర్గతం అయ్యాయి. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను విధుల నుంచి తప్పించి విచారణకు ఆదేశించింది. నాడు అర్ధంతరంగా ఆగిపోయిన నిర్మాణం నేడు విద్యార్థుల పాలిట శాపంగా మారింది. శిథిలావస్థకు చేరిన పిల్లర్లు, స్లాబ్‌పైకి ఎవరైనా వెళ్లితే ఊగుతోంది. సుమారు 400 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్న బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో ఈ నిర్మాణం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు భవనంపైకి ఎక్కితే కూలిపోయే స్థితిలో ఉంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

క్లుప్తంగా

‘టాస్’లో ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు

సెప్టెంబర్ 20వరకు దరఖాస్తులకు అవకాశం

కొడంగల్ రూరల్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జెడ్పీహెచ్ఎస్(బాలుర) హెచ్ఎం, స్కూల్ కో ఆర్డినేటర్ మురళీధర్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ గోపీనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 20 వరకు అడ్మిషన్‌కు అవకాశం ఉందని చెప్పారు. పదవ తరగతి అడ్మిషన్‌కు గతంలో చదివిన టీసీ లేదంటే జనన ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు రెండు సెట్ల జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అందజేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్‌కు 10వ తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు రెండు సెట్ల జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను జెడ్పీహెచ్ఎస్(బాలుర) కొడంగల్ పాఠశాలలో అందజేయాలన్నారు.

రిపోర్టుల ఆధారంగా చర్యలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్

అనంతగిరి: వికారాబాద్ మండలం పీరంపల్లిలో అనారోగ్యానికి గురైన వారి నుంచి నమూనాలు సేకరించామని.. రిపోర్టులు వస్తేనే కల్లు కల్తీ అయింది లేనిది నిర్ధారిస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామంలో అస్వస్తకు గురవ్వడానికి కల్తీ కల్లు కారణం కాదని భావిస్తున్నామన్నారు. ఘటన జరిగిన వెంటనే టాస్క్ ఫోర్స్ టీం సహకారంతో నమూనాలు తీసుకున్నామని చెప్పారు. రిపోర్టుల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది 124 దుకాణాల్లో తనిఖీలు చేపట్టగా నాలుగు దుకాణాల్లో కల్తీ కల్లు గుర్తించి లైసెన్స్ రద్దు చేసిన నలుగురు బాధ్యులపై చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి బలవన్మరణం


కృష్ణకుమార్ (ఫైల్)

తాండూరు రూరల్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని జినుగుర్తిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వొలిగిరి కృష్ణకుమార్(30) వృత్తి రీత్యా డ్రైవర్. ఈయనకు కొన్నేళ్ల క్రితం పెద్దేముల్ మండలం బుద్దారం గ్రామానికి చెందిన సావిత్రితో వివాహమైంది. సంతానం లేకపోవడంతో ముభావంగా ఉండేవాడు. కొంత కాలంగా మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి అదే మత్తులో ఇంట్లో పురుగు మందు తాగాడు. గ్రామానికి చెందిన నారాయణకు ఫోన్ చేసి నేను చనిపోతున్నా అని చెప్పాడు. తక్షణమే నారాయణ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో వెంటనే తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మరణించాడు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. జీవితం విరక్తితో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి లక్ష్మి పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ వ్యక్తి మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని జూలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జంగయ్య(34) గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఆవేశంలో మాటామాట పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన జంగయ్య ఇంట్లోనే చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య పరమేశ్వరి, తండ్రి నాగయ్య, చెల్లెలు సంతోష ఉన్నారు. శుక్రవారం మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


మల్లికార్జున ఒగ్గు డోలు కళాబృందం ప్రదర్శన

ఫోక్ ఫెస్టివల్‌లో ఒగ్గు డోలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో గురజాడ కళాక్షేత్రం వేదికగా ప్రపంచ జానపద ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచి మండల పరిధిలోని నాందాపూర్ గ్రామానికి చెందిన మల్లికార్జున ఒగ్గు డోలు కళా బృందం హాజరై ప్రదర్శనలిచ్చింది. వారి విన్యాసాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఆహూతులను అబ్బురపరిచాయి.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్, హోం శాఖ మంత్రి అనిత, హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, వీవీ రమణమూర్తి ప్రత్యేకంగా అభినందించారని ఒగ్గు జీరు తెలిపారు.

– బొంరాస్‌పేట


మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాందాపూర్ ఒగ్గు కళాకారులు

ధారూరు అభివృద్ధికి రూ.57 లక్షలు

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

వికారాబాద్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్

ధారూరు: నీతి ఆయోగ్ ద్వారా తెలంగాణకు రూ.1,200 కోట్లు మంజూరవ్వగా.. ధారూరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.57 లక్షలు వచ్చాయని వికారాబాద్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కాలనీల్లో పర్యటించి తాగునీటి పైప్‌లైన్లను పరిశీలించారు. ఎన్‌డీఎఫ్ ద్వారా రూ.13.20 లక్షలు (ధారూరు గ్రామ పంచాయతీకి) మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు ఆయనతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కాలనీల్లో తాగునీటి పైప్ లైన్లు వేయలేదని, కొన్ని కాలనీలకు తాగునీరు సరఫరానే లేదని డీఈకి వివరించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. ధారూరు పంచాయతీకి మంజూరైన నిధులతో కూరగాయల మార్కెట్లోని పాత ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరినందున దాని స్థానంలో కొత్తగా 60 కేవీ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తామన్నారు. మరో రెండు కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ వేయనున్నట్లు వివరించారు. కొత్తగా 190 నల్లా కనెక్షన్లు ఇస్తామన్నారు. రూ.5లక్షలతో 400 మీటర్ల తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం, రూ.5 లక్షలతో రెండు బోర్లు, పంపుసెట్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. రూ.3.20 లక్షలతో ఎనిమిది బోర్లు ఫ్లషింగ్ చేయించాల్సి ఉందని, త్వరలో పనులు ప్రారంభించి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని అన్నారు. ఇందుకోసం త్వరలో టెండర్ వేయిస్తామని చెప్పారు. డీఈ వెంట గ్రామ కార్యదర్శి అంజానాయక్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాకాన్, ఎల్.అశోక్‌ముదిరాజ్, అమరేశ్వర్‌రావు, బోయిని అంజయ్య, మల్లికార్జున్, ఇబ్రాహీం, ముజాఫర్ తదితరులు ఉన్నారు.


ధారూరు ఎస్సీ కాలనీలో మురుగు కాల్వలో వేసిన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఈ రత్నప్రసాద్

రుణమాఫీ చేశాం

- జీఆర్ఎస్ ఎంతమంది రైతులకిచ్చిందో లెక్క చెప్పాలి
- పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

తాండూరు టౌన్: రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఎంత మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేశారో లెక్క తీయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకున్నాడన్నారు. ఆధార్, పాస్‌బుక్, రేషన్ కార్డు వివరాలు సరిపోలని రైతుల మాఫీ ఆలస్యమవుతోందన్నారు. బాధితులు దరఖాస్తులు సమర్పిస్తే వారివి కూడా మాఫీ చేస్తామన్నారు. ఇదే అంశాన్ని అడ్డుగా పెట్టుకుని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు రాజీనామా చేయకుండా మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. తాండూరు ఎమ్మెల్యే బీఎమ్మార్‌పై అవాకులు చవాకులు పేలుతున్న నాయకులు రూ.1600 కోట్ల అభివృద్ధి ఎక్కడ చేశారో చూపాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్థానికతను బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. అనంతరం నాయకులు ఉత్తమ్‌చంద్, కరణం పురుషోత్తంరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో దౌలాపూర్ వద్ద ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇటీవలే నియోజకవర్గ పరిధిలో రూ.250 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని కోటపల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తాండూరు –కొడంగల్ హైవేకు లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాధవరెడ్డి, అంజయ్య, నీరజ, అజయ్ ప్రసాద్, హబీబ్‌లాలా, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ధారాసింగ్

కూల్చివేతలు సరికాదు


నెర్రపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్లాట్ల యజమానుల ధర్నా

గ్రామ పంచాయతీ ఎదుట బాధితుల ధర్నా

- పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాని డిమాండ్

ఇబ్రహీంపట్నం: తమ ప్లాట్ల రక్షణ కోసం నిర్మించుకున్న ప్రహరీని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని దివ్యసాయి వెంచర్‌లో ప్లాట్ల యజమానులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం వారు నెర్రపల్లి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004లో పంచాయతీ పరిధిలో దివ్యసాయినగర్ పేరుతో చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి వాటి క్రమబద్ధీకరణ ఫీజులను చెల్లించామన్నారు. తాము కొనుగోలు చేసిన ప్లాట్ల రక్షణకు ప్రహరీ నిర్మించుకుంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి వీణ ప్రహరీ కూల్చివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడుపులు ఇవ్వనందుకే తమ నిర్మాణాలను కూల్చేవేశారని ఆరోపించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వీణతో వాగ్వాదానికి దిగారు. తామంతా మధ్యతరగతి రిటైర్డ్ ఉద్యోగులమని తమకు నష్టం కలిగించిన పంచాయతీ కార్యదర్శి వీణపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, విమల, రాజేందర్, వెంకటేశ్, మదన్‌మోహన్, దామోదర్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశానుసారమే..

ఉన్నతాధికారుల ఆదేశానుసారమే నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు నెర్రపల్లి పంచాయతీ కార్యదర్శి వీణ వివరణ ఇచ్చారు. ఆ నిర్మాణాలకు అనుమతులు లేవని.. సీఎస్, డీపీఓలో అందిన ఫిర్యాదుల నేపథ్యంలో వారిచ్చిన ఆదేశానుసారం నిర్మాణాలను తొలగించామన్నారు. బాధితుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దేముల్: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీస్‌లు సీజ్ చేశారు. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన సయ్యద్ ఇసుక ట్రాక్టర్‌ను తరలిస్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీ పోలీసులు ప్రశ్నించగా అతని వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేవు. దీంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి పెద్దేముల్ తహసీల్దర్‌కు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

ఓపీఎస్ అమలు చేయాలి

ఆందోళన చేపట్టిన మున్సిపల్ ఉద్యోగులు


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తాండూరు టౌన్: పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానమే తీసుకువస్తాని ప్రస్తావించిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో జూనియర్ అసిస్టెంట్లు రాములు, నర్మద, యాదగిరి, సతీష్, బిల్ కలెక్టర్లు నాగేందర్, కపిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ విఠల్ తదితరులు పాల్గొన్నారు. వీరికి ఐకేపీ, కాంట్రాక్ట్ ఉద్యోగులు మద్దతు ప్రకటించారు.

డీసీఎం బోల్తా


ఘటనా స్థలిలో బోల్తాపడిన డీసీఎం

పరిగి: ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఓ డీసీఎం బోల్తాపడింది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. షాద్‌నగర్ నుంచి ఓ డీసీఎం పరిగి సుగుణ స్టీల్ కంపెనీకి స్క్రాబ్ లోడ్‌తో వెళ్తోంది. జాఫర్‌పల్లి సమీపంలో ఎదురుగా కారు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో డీసీఎం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ నసీర్‌కు గాయాలవ్వడంతో పరిగి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

శంకర్‌పల్లి: పురుగు మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాసానిగూడకు చెందిన రాంచంద్రయ్య(43) రైతు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాంచంద్రయ్య వ్యక్తిగత కారణాలతో ఈ నెల 16న పొలం వద్ద పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రైతు శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా మంటలు


గాయపడిన దేవప్ప


గాయపడిన మగ్దూమ్

- ఇద్దరికి తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

బషీరాబాద్: గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని రెడ్డి ఘనాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. పెద్ద కుర్వ దేవప్ప, లక్ష్మి దంపతులు గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. కూలీలకు కూలి డబ్బు ఇచ్చేందుకు లక్ష్మి బయటకు వెళ్లింది. భార్య వచ్చే వరకు వంట చేసేందుకు భర్త దేవప్ప వంటగదిలోకి వెళ్లాడు. గ్యాస్ లీకైన వాసన వస్తుండడంతో పక్కింటి మగ్దూమ్‌ను తీసుకువచ్చాడు. అప్పటికే స్టవ్ ఆన్ చేసి ఉండడంతో ఇళ్లంతా గ్యాస్ వ్యాపించింది. రెగ్యులేటర్, గ్యాస్‌పైప్ చెక్‌చేసిన మగ్దూమ్ స్టవ్ ఆన్ చేసేందుకు అగ్గిపుల్ల గీయడంతో ఒక్కసారిగా మంటలు అలుముకున్నాయి. మంటలతో బయటకు పరుగెత్తుకొచ్చిన దేవప్ప, మగ్దూమ్‌లను గమనించిన గ్రామస్తులు మంటలార్పేశారు. విషయం తెలుసుకున్న లక్ష్మి క్షతగాత్రులను వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించింది. 50శాతం కాలిన గాయాలతో వారు చికిత్స పొందుతున్నారు. వీరిలో మగ్దూమ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

అతివేగం తీసింది ప్రాణం

- కారును ఢీకొట్టిన బొలేరో
- ఓడీఎఫ్ ఉద్యోగి మృతిం


జంగారెడ్డి(ఫైల్)

శంకర్‌పల్లి: అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓడీఎఫ్(ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ) ఉద్యోగి ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన శంకర్‌పల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని సింగాపురానికి చెందిన సీహెచ్.జంగారెడ్డి(53) ఓడీఎఫ్ ఉద్యోగి. ఆనయకు భార్య కవిత, కుమార్తె(వివాహిత), కుమారుడు ఉన్నారు. గురువారం ఉదయం ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో భార్యతో కలిసి వికారాబాద్ వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మండల పరిధిలోని కచ్చిరెడ్డిగూడ వద్ద మూలమలుపులో ఎదురుగా వస్తున్న బొలేరో వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జంగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. భార్య చేయి విరిగింది. ఆమెకు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. విదేశాల్లో చదువుకుంటున్న కుమారుడు వచ్చాక శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నాగన్‌పల్లిలో ‘పోలీసు శిక్షణ’


నాగన్‌పల్లిలో కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు తదితరులు

- రాచకొండ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు
- పచ్చజెండా ఊపిన ప్రభుత్వం
- కళాశాల ఏర్పాటుకు భూమిని పరిశీలించిన సీపీ
- మారనున్న ‘పట్నం’ రూపురేఖలు

ఇబ్రహీంపట్నం రూరల్: రక్షణ రంగ సంస్థలకు ఇబ్రహీంపట్నం నిలయంగా మారింది. ఇప్పటికే ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ లాంటి సంస్థలు నాగన్‌పల్లి, ఇబ్రహీంపట్నం మధ్యలో కొలువుదీరాయి. వీటికి తోడుగా హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ తరహాలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో అత్యాధునిక శిక్షణ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశానికి, రాష్ట్రానికి కావాల్సిన పోలీస్‌వింగ్‌లు సమీపంలో ఉండడంతో రాచకొండ పోలీస్ శిక్షణ కళాశాల ఏర్పాటు సైతం ఇక్కడే చేయాలని భావిస్తోంది.

పోలీస్ శాఖకు ఆదేశాలు

ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాత్రమే పోలీస్ శిక్షణ కళాశాల ఉంది. మూడు కమిషనరేట్‌లు ఏర్పాటైన కారణంగా మూడు ప్రాంతాల్లో ట్రైనింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు పనులను ముమ్మరం చేయాలని, భూ సేకరణ చేపట్టాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును ఆదేశించింది. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి సమీపంలోని సర్వే నంబర్ 291లో గల భూదాన్ భూమిని పరిశీలిస్తున్నారు. ఈ భూమిలో ఇప్పటికే ఓ ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థ ప్లాట్లుగా మార్చింది. రెవెన్యూ శాఖ పీఓటీ కింద భూమిని సేకరించి ట్రైనింగ్ కళాశాలకు ఇవ్వాల్సి ఉంటుంది. కళాశాల ఏర్పాటుకు 10 ఎకరాలు అవసరం ఉంది. ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ కేంద్రాలకు సమీపంలో రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండడంతో ఇదే అనువైన ప్రదేశంగా అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. నాగన్‌పల్లి రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇటు పోల్కంపల్లి రోడ్డు, అటు రాయపోల్ రోడ్లకు మధ్యలో ఈ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు.

భూమిని పరిశీలించిన రాచకొండ సీపీ

రాచకొండ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఏర్పాటు కోసం శుక్రవారం నాగన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 291లోని భూమిని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు మహేశ్వరం జోన్ డీసీపీ సునితా రెడ్డితో కలిసి పరిశీలించారు. కళాశాల ఏర్పాటుకు ఇదే అనువైన ప్రదేశమని సూచించారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజును ఆదేశించారు. రెవెన్యూ అధికారులను భూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. గంజాయి సరఫరా వినియోగాన్ని అరికట్టాలని, వాహనాల పత్రాలను చెకింగ్ చేయాలని సూచించారు. నేరాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ట్రైనింగ్ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలతో పాటు నిఘా పెరుగుతుందన్నారు.

పరమేశ్వరాలయంలో చోరీ

బొంరాస్‌పేట: గుర్తు తెలియని దుండగులు ఆలయంలో హుండీ ధ్వంసం చేసి నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి శివారులోని పార్వతీపరమేశ్వరాలయంలో చోటు చేసుకుంది. రోజుమాదిరిగానే శుక్రవారం ఉదయం ఆలయానికి పూజారి వెళ్లగా హుండీ ధ్వంసమైనట్లు గుర్తించి ఆలయ కమిటీకి సమాచారం అందించారు. దీంతో కమిటీ సభ్యులు అంజిలయ్య, రాములు, కేశవులు, శ్రీనివాస్, నర్సింలు ఘటనా స్థలిని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.


దుండగులు ధ్వంసం చేసిన హుండీ

జిల్లా సహకార అధికారిగా సుధాకర్


సుధాకర్‌కు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా సహకార అధికారిగా సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. తన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తానని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు సత్యనారాయణ రెడ్డి, మాధవరెడ్డి, విజయ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.